క్లుప్తంగా

కళాకారుడికి పొట్టి శ్రీరాములు పురస్కారం


ఎల్లయ్య

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన కళాకారుడు కొంకల ఎల్లయ్యకు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పురస్కారం లభించింది. వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారికి ఏటా ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తోంది. ఈసారి కళాకారుడు కొంకల ఎల్లయ్య పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో పురస్కారంతో పాటు రూ. 20,116 నగదు బహుమతి అందజేయనున్నట్లు ఎల్లయ్య తెలిపారు. ఆయనను కవులు, కళాకారులు అభినందించారు.

నూతన నియామకం


నియామక పత్రం అందుకుంటున్న ర్యాకం శ్రీరాములు

దుబ్బాకటౌన్: జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్‌గా ర్యాకం శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీరాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఉద్దండాపురం సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

వెండి శఠగోపం బహూకరణ


చంద్రారెడ్డి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయానికి భక్తుడు ఐనకొండ చంద్రారెడ్డి సోమవారం వెండి శఠగోపం బహూకరించారు. చంద్రారెడ్డి కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ భాస్కర్ శాలువ కప్పి సన్మానించారు. ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు కనకయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిని మహేష్, బాల్‌నర్సయ్య, గుండ శ్రీనివాస్, రమేష్ గుప్త, బబ్బూరి శ్రీను, నాగేందర్, నాగరాజు, భాస్కర్, రాంరెడ్డి, కార్తీక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన బేగంపేట


ఆనందయ్య మఠంలో అన్నపూజలో పాల్గొన్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలోగల శ్రీసద్గురు సంగమేశ్వర ఆనందయ్య మఠంలో సోమవారం జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. ఏటా కాముని పౌర్ణమి (హోలీ) రోజున ఈవేడుకలు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అన్నపూజ, అభిషేకం తదితర పూజలు జరిగాయి. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

ముదిరాజులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

దుబ్బాకటౌన్: భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన ముదిరాజులకు న్యాయం జరిగేవరకూ పోరాడుతామని.. ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షుడు ఈట జగన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారికి గ్రామంలో ఎలాంటి పనులు చేయొద్దని సంఘ బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో మత్స్య సహకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం చేస్తామని వెల్లడించారు.

ముంచుకొస్తున్న గడువు

- మార్చి 31 డెడ్ లైన్
- బల్దియా నెత్తిన ఆస్తిపన్ను వసూలు
- ఆరురోజుల్లో రూ.5 కోట్లు
- చేర్యాలలో కొలిక్కి రాని పంచాయితీ


సిద్దిపేటలో ఆస్తి పన్ను వసూలును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి (ఫైల్)

సిద్దిపేటజోన్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు లక్ష్యం గడువు ముంచుకొస్తుంది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టార్గెట్ ఈనెల 31 లోగా పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే విస్తృతంగా ప్రచారం, ఆస్తిపన్ను చెల్లింపుదారుల్లో చైతన్య పరిచిన అధికార యంత్రాంగం లక్ష్యం అధిగమించేందుకు వేగం పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిల మీద విధించిన వడ్డీలో 90 శాతం మాఫీ ప్రకటన చేసింది. ప్రభుత్వ వెసులుబాటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బల్దియా నిర్దేశిత లక్ష్యం దాటేందుకు బల్దియా కమిషనర్లు క్షేత్ర స్థాయిలో అడుగులు వేస్తున్నారు. వందశాతం వసూళ్ల లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నప్పటికీ డెడ్ లైన్ మార్చి 31 ముంచుకొస్తున్న సమయంలో రూ.ఐదు కోట్ల ఆస్తి పన్ను వసూలు అధికార యంత్రాంగానికి గుదిబండగా మారింది. కేవలం ఆరు రోజుల్లో వందశాతం పూర్తి చేయాల్సి ఉంది.

మున్సిపాలిటీల వారీగా..

జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపల్ రికార్డుల ప్రకారం నివాసిత, నివాసేతర అసెస్‌మెంట్, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను వసూలు ప్రక్రియకు అనుగుణంగా మార్చి 31లోగా ఆర్థిక సంవత్సరం లక్ష్యం నిర్దేశించారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలో రూ.12.76 కోట్లకు రూ 11.39 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు గజ్వేల్‌లో రూ.4.59 కోట్లకు రూ.3.41 కోట్లు, హుస్నాబాద్‌లో రూ.1.65 కోట్లకు రూ.1.26 కోట్లు, దుబ్బాకలో రూ.2.01 కోట్లకు రూ.1.34 కోట్లు, చేర్యాల మున్సిపాలిటీలో రూ.2.64 కోట్లకు రూ 1.32 కోట్లు వసూలయ్యాయి. నిర్దేశించిన గడువు మరో ఆరు రోజుల్లో ముగియనున్న క్రమంలో సిద్దిపేటలో రూ.1.36 కోట్లు, గజ్వేల్‌లో రూ.1.18 కోట్లు, చేర్యాలలో రూ.1.32కోట్లు దుబ్బాకలో రూ.66 లక్షలు, హుస్నాబాద్‌లో రూ.38 లక్షలు వసూలు చేయాల్సి ఉంది.

ప్రభుత్వ మాఫీ పథకం ఆసరాగా..

జిల్లాలో పెద్ద ఎత్తున మొండి బకాయిలు పేరుకుపోయిన నేపథ్యంలో జిల్లా మున్సిపల్ అధికారులు వాటిని వసూలు చేసేందుకు ప్రభుత్వ వడ్డీ మాఫీ ప్రక్రియను ముందుకు తెస్తున్నారు. ఆస్తి పన్ను మీద ఉన్న వడ్డీలో 90 శాతం మాఫీ వెసులుబాటు వివరిస్తూ మొండి బకాయిలు వసూలు వేగవంతం చేయాలని బల్దియా అధికారుల ఆలోచన. అందుకు అనుగుణంగా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా ఆటోలను ఏర్పాటు చేసి వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

కొలిక్కిరాని పంచాయితీ..

చేర్యాల మున్సిపల్ భౌగోళికంగా చిన్నది. ఇటీవల మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. చేర్యాల పరిధిలో ప్రస్తుతం రూ.1.32 కోట్ల ఆస్తి పన్ను వసూలు అధికారులకు కత్తి మీద సాములా మారింది. సుమారు వెయ్యి అసెస్‌మెంట్ లకు సంబంధించి ఆస్తి పన్ను జమ వివాదం నెలకొన్న నేపథ్యంలో వందశాతం వసూలు చేర్యాలలో ప్రశ్నార్థకంగా మారింది.


తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు గింజల బస్తాలు

ముమ్మరంగా పొద్దు తిరుగుడు కొనుగోలు

తొగుట(దుబ్బాక): తొగుట వ్యవసాయ మార్కెట్‌లో పొద్దు తిరుగుడు గింజల కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతోంది. పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సొసైటీ చర్యలు తీసుకుంది. అధికారులు గోనె సంచులు, రవాణాకు లారీలను అందుబాటులో ఉంచారు. కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు గింజలను వెంటనే గోదాములకు తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొగుటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులకు సౌకర్యంగా ఉంది. క్వింటాల్‌కు ప్రభుత్వం మద్దతు ధర రూ. 6,760 చెల్లిస్తోంది. గతంలో రైతులు దళారులకు విక్రయించేవారు. లేదంటే సిద్దిపేటకు తరలించి మిల్లర్లకు విక్రయించేవారు. సరైన ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు మద్దతు ధరతో లాభం, రవాణా ఖర్చులు మిగిలుతున్నాయి. యాసంగిలో ఆరుతడి పంటలైన పొద్దు తిరుగుడు, మొక్కజొన్న సాగుచేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఈ ఏడాది మండలంలో సమారు 600 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగుచేశారు. కొనుగోలు కేంద్రం ద్వారా 222 మంది రైతుల నుంచి 2,764.50 క్వింటాళ్ల గింజలు కొనుగోలు చేశారు. మండల రైతులతో పాటు రాయపోల్, మిరుదొడ్డి, దౌల్తాబాద్, కొండపాక మండలాల రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రానున్నరోజుల్లో పొద్దుతిరుగుడు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

అన్ని వర్గాలకు బీఆర్ఎస్ అండ

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. క్రైస్తవులు మినీ జెరూసలెంగా భావించే ఘట్‌కేసర్ చర్చిని సందర్శించేందుకు జిల్లాకు చెందిన 150 మంది పాస్టర్లు మూడు బస్సులలో సోమవారం తరలివెళ్లారు. వారికి జెడ్పీ చైర్మన్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత సామరస్యానికి సిద్దిపేట ప్రతీక అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, రాజనర్సు, పాలసాయిరాం, తదితరులు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ

పోలింగ్ కేంద్రం సందర్శన

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ శ్రీను అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిట్యాల గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే లాభాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయితో కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ దామోదర్ ఉన్నారు.


చిట్యాలలో పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీను

బండికే గిరిజనుల మద్దతు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని గిరిజనుల మద్దతు ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కే ఉంటుందని బీజేపీ మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు లావుడ్య రాజన్‌నాయక్ అన్నారు. సోమవారం భల్లునాయక్ తండా గిరిజనులతో మాట్లాడి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలవాలని, మళ్లీ మోదీని ఎన్నుకోవాలన్నారు. గిరిజనుల సమస్య పరిష్కారం కోసం మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ గజ్వేల్ కన్వీనర్‌గా రమేశ్

గజ్వేల్: ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్‌గా శనిగరి రమేశ్ నియమితులైనట్లు జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ తెలిపారు. సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నియామక పత్రం అందజేశారన్నారు. ఏబీసీడీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లే క్రమంలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎంపీ అభ్యర్థిని కలిసిన బీఆర్ఎస్ నేతలు


శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని ఇటీవల ప్రకటించడంతో ఎంపీ అభ్యర్థిని కలిసిన బీఆర్ఎస్ నేతలు జగదేవ్‌పూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు నర్సింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, కనకయ్య సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు శాలువా కప్పి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

ముదిరాజ్‌లకే ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ పదవి


శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకే ఇవ్వాలని హుస్నాబాద్ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మీర్జాపూర్ ముదిరాజ్ సంఘం సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకార సొసైటీల్లో ముదిరాజ్‌లకు ఎక్కువ సభ్యత్వాలు ఉన్నాయని, అలాంటి ముదిరాజ్ సామాజిక వర్గానికి కాకుండా గంగపుత్రులకు ఎట్లా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముదిరాజ్‌లకే ఇవ్వాలన్నారు. గ్రామాల్లో చేపల వ్యాపారం చేసుకునేందుకు మత్స్యకారులకు వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీపై ద్విచక్ర, త్రీ వీలర్స్, గూడ్స్ వాహనాలను అందించాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి వద్ద ఈనెల 22వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు మహిళ గాయపడింది. క్షతగాత్రురాలు కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లాకు చెందిన రాజకుమారి హైదరాబాద్ నుంచి కారులో కరీంనగర్ వస్తుండగా తోటపల్లి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. లారీని రోడ్డు పక్కన నిలుపడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ నిరంజన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాజకుమారి మృతదేహం

హోలీ.. రంగుల కేళి

హోలీ పండగను సోమవారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజకీయ నాయకుల సైతం రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలిపారు. 119 ఏళ్ల వయో వృద్ధురాలు పంజాల లక్ష్మీ తన మనుమడితో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొంది. ప్రజలకు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మానకొండూరు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.


వర్గల్(గజ్వేల్): వర్గల్‌లో హోలీ వేడుకల్లో గ్రామస్తులు


జగదేవ్‌పూర్(గజ్వేల్): మునిగడపలో యువకుల సంబరాలు


దుబ్బాకలో హోలీ వేడుకల్లో బీఆర్ఎస్, మున్సిపల్ నాయకులు


మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో రంగులు పులుముకుంటున్న చిన్నారులు


చిన్నకోడూరులో హోలీ వేడుకలు


బెజ్జంకి(సిద్దిపేట): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోలీ ఆడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మండల నాయకులు


హోలీ వేడుకల్లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజితపై రంగులు చల్లుతున్న కార్మికులు


నంగునూరులో హోలీ వేడుకలో యువకుల సందడి


చేర్యాలలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

అవిశ్వాసానికి రెండు రోజులే !

- ఎంపీపీ పదవి కోసం యత్నం
- 20 రోజులుగా క్యాంపు రాజకీయం
- మళ్లీ బీఆర్ఎస్‌కేనని ధీమా
- కాంగ్రెస్‌లోకి చేరేలా ఎత్తుగడ

కొండపాక(గజ్వేల్): తమను పట్టించుకోవడంలేదని కినుకవహించిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు అవిశ్వాసానికి తెరలేపారు. ఈ విషయంపై మండలంలో జోరుగా చర్చ సాగుతోంది. ఈనెల 5వ తేదీన ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తీర్మాన ప్రతిని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు అందజేసి క్యాంపులోకి వెళ్లారు. 28వ తేదీన అవిశ్వాస తీర్మానం ఉండటంతో రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు మెజారిటీ కోరం సభ్యులు 20 రోజులుగా క్యాంపులో ఉన్నారు. అవిశ్వాసం నెగ్గితే మళ్లీ బీఆర్ఎస్ పార్టీకే ఎంపీపీ పదవి దక్కుతుండటంతో ఆ పార్టీ ముఖ్య నాయకులు తీర్మానం వీగిపోవడానికి పెద్దగా ప్రయత్నాలు చేయడంలేదన్న ప్రచారం సాగుతోంది. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన రోజునే బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డిని కలుసుకోవడంతో కాంగ్రెస్‌లో చేరుతారా అన్న విషయం జోరుగానే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కొండపాక మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ అధ్యక్ష పదవి బీసీ మహిళగా రిజర్వు అయ్యింది. 14 ఎంపీటీసీ స్థానాలకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఎనిమిది బీఆర్ఎస్, మూడు కాంగ్రెస్, మూడు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. బందారం ఎంపీటీసీ పదవి జనరల్ మహిళకు రిజర్వు అయినప్పటికినీ ఎంపీపీ పదవికి కావల్సిన మెజారిటీ ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీ తరుపున గెలుపొందితే ఎంపీపీ పదవి దక్కించుకునేలా నాయకులు వ్యూహం రూపొందించారు. బందారం ఎంపీటీసీగా ర్యాగల్ల సుగుణను గెలిపించుకున్నారు. అనుకున్నట్లుగా ఎనిమిది స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో ఎంపీటీసీలుగా గెలుపొందడంతో ఎంపీపీగా ర్యాగల్ల సుగుణను ఎన్నుకున్నారు. అలాగే స్వతంత్రులుగా గెలుపొందిన ముగ్గురు ఎంపీటీసీలు బీఆర్ఎస్‌లో చేరడంతో సభ్యుల సంఖ్య 11కి చేరింది. కుకునూరుపల్లి ఎంపీటీసీ 2 (కాంగ్రెస్) రెడ్డమైన గీత అనారోగ్యంతో మృతి చెందింది.


కొండపాక ఎంపీడీఓ కార్యాలయం

గతంలో ఎంపీపీ అధ్యక్ష పీఠంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎంపీటీసీలు ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలన్న నిర్ణయంతో ఆర్డీఓకు అవిశ్వాస తీర్మాన ప్రతిని అందించి అక్కడి నుంచి నేరుగా క్యాంపులోకి వెళ్లారు. తొమ్మిది మందిలో ఒక్కరు బయటకు వెళ్లినా అవిశ్వాసం వీగిపోనుండటంతో పకడ్బందీగా క్యాంపు రాజకీయాన్ని కొనసాగిస్తున్నారు. అవిశ్వాసం నెగ్గితే కొండపాక బీఆర్ఎస్ ఎంపీటీసీ మంచాల అనసూయకు దక్కే అవకాశాలున్నట్లు చర్చించుకుంటున్నారు.

అవిశ్వాసం నెగ్గినా మళ్లీ బీఆర్ఎస్‌కే ఎంపీపీ అధ్యక్ష పదవి దక్కుతుండటంతో కారు పార్టీ మద్దతుతో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్న నాయకులు అవిశ్వాసంపై పెద్దగా దృష్టి పెట్టలేదని చర్చించుకుంటున్నారు. కాగా కోరం సభ్యులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డిని కలవడంపై రాజకీయం మరో రకంగా మారుతుందా అన్న విషయం బీఆర్ఎస్ నాయకులను కలవరానికి గురి చేస్తోంది. వైస్ ఎంపీపీపై సైతం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన గడువు కూడా తక్కువే. రెండు పదవులకు ఒకే సారి అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టడం మండలంలో రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. ఎంపీపీ పదవి మళ్లీ బీఆర్ఎస్‌కే దక్కుతుందా లేదా కాంగ్రెస్‌ను వరిస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

వివాహిత అదృశ్యం

దుబ్బాకరూరల్: వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని రాజక్కపేట గ్రామంలో జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పడిగె భాగ్య సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు బంధుమిత్రులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి బాల్‌నర్సవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పోలీసులకుతెలపాలన్నారు.


భాగ్య